
నేడు బక్రీద్




పుట్టపర్తిరూరల్, జూన్ 16: ముస్లింల ప్రధాన పండుగల్లో ఒకటైన బక్రీద్‌కు జిల్లా ముస్తాబైంది. బక్రీద్ పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా ముస్లింలు సోమవారం ఘనంగా చేసుకోనున్నారు. మసీదులు, ఈద్గాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

ఇంకెప్పుడు..?

- సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు
- ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం
- రైతులకు తప్పని ఎదురుచూపు
- గృహ వినియోగ మీటర్లదీ అదే దుస్థితి



సబ్‌స్టేషన్‌లో నిలువ ఉంచిన ట్రాన్స్‌ఫార్మర్లు





ఏఈ కార్యాలయంలో ఉన్న మీటర్లు

నంబులపూటకుంట

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఏటా పంటలు చేతికందట్లేదు. మెట్ట సేద్యం చేయలేమని రైతులు నిర్ణయానికొచ్చారు. బోరుబావులు వేసుకునైనా పంటలు పండించుకుందామని భావిస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా.. అప్పులు చేసి బోర్లు వేయిస్తున్నారు. చాలాబోర్లు విఫలమవుతున్నాయి. నీరు పడితే చాలు దేవుడా అంటూ ఉపశమనం పొందుతున్నారు. బోరుబావికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించుకోవాలంటే రైతులకు చుక్కలు చూపుతున్నారు. విద్యుత్ శాఖాధికారులు చెప్పిన మేరకే ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు డీడీలు తీసి, దరఖాస్తు చేసుకుని ఎదురుచూడడం అన్నదాతల వంతవుతోంది. నెలలు, సంవత్సరాల తరువాత ఎట్టకేలకు ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయి. రోజులు గడుస్తున్నా.. వాటిని పంపిణీ మాత్రం చేయట్లేదు. ఇదేంటని అడిగితే ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు అవసరమైన కేబుల్ ఇతరత్రా సామగ్రి రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో విద్యుత్ కార్యాలయానికి రావడం, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయో.. ఎవరికైనా ఇచ్చారో చూసుకుని వెళ్లడం రైతుల దినచర్యగా మారింది. గృహాలకు విద్యుత్ మీటర్ల ఏర్పాటులోనూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మీటర్లు కుప్పగా పడి ఉన్నాయి.

సరఫరాకాని సామగ్రి

రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తామ ని గతంలో వైసీపీ పాలకులు ప్రగల్భాలు పలికారు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చే సుకున్న రైతులకు మాత్రం చుక్కలు చూపించారు. నెలలు, ఏళ్ల తరబడి ట్రాన్స్‌ఫార్మర్లు స ర ఫరా చేయలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంజూరైన వాటిని కూడా పొ ల్లాలో ఏర్పాటు చేయకపోవడం తో నెలల తరబడి సబ్‌స్టేషన్‌లో మూలుగుతున్నాయి. దరఖాస్తు చేసుకున్న రైతులు నెలల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పులు చేసి, బోరుబావి వేయించి, దానికి విద్యుత్‌శాఖ ప్రణాళిక మేరకు డీ డీలు తీశారు. ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాదైనా పంటలు సాగు చే సుకుని, అప్పుల నుంచి బయట పడదామని రైతులు భావిస్తున్నారు. పంట సాగుచేసిన తరువాత వర్షాలు రాకపోయినా, బోరుబావికి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకుంటే, నీటి తడులి చ్చి కాపాడుకోవచ్చన్న ఆశలో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో 50 మందికి పైగా ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. నెలరోజుల క్రితం సబ్‌స్టేషన్‌కు 15 ట్రాన్స్‌ఫార్మర్లు చేరాయి. ఆయా రైతులకు మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లు వారికి ఇవ్వలేదు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇతరులకు ఇస్తారేమోనన్న అనుమానంతో రోజూ వచ్చి రైతులు చూసుకుని, వెళ్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అవసరమైన వైరు, ఫ్యూజు సెట్, ఎర్త్ పైపు తదితరాలు సరఫరా కావాల్సి ఉందని విద్యుత్ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇవేవీ కార్యాలయంలో కనిపించట్లేదు. ఈ సామగ్రికి మండల ఇంజనీర్ ప్రణాళిక సిద్ధం చేయాల్సి ఉంది. అవి లేకపోవడంతోనే రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.

గృహ మీటర్ల ఏర్పాటులో నిర్లక్ష్యం

గృహ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయడంలో మండలంలో ఆ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. మండల ఇంజనీర్ కార్యాలయంలో వందల కొద్దీ మీటర్లు మూలుగుతున్నాయి. వీటిని గృహాలకు ఏర్పాటు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. నూతనంగా ఇళ్లు నిర్మించుకున్న వారు, మీటర్లు మరమ్మతులకు లోనైనవారు దరఖాస్తు చేసుకుని, ఎదురుచూస్తున్నారు. మీటర్లు మంజూరైనా వాటిని ఏర్పాటు చేయడంతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. మండలకేంద్రంలో ఇటీవల ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిశాయి. విద్యుత్ సమస్య ఉందని తెలిపినా అధికారులు స్పందించడంలేదని ప్రజలు వాపోతున్నారు. మండలకేంద్రంలో విద్యుత్ సమస్య తలెత్తితే సిబ్బంది అందుబాటులో ఉండట్లేదనీ, ఫోన్లు కూడా ఎత్తట్లేదని ప్రజలు వాపోతున్నారు. మండల ఇంజనీర్‌తోపాటు సబ్ ఇంజనీర్, ఎల్ఐ, ఏఎల్ఎం సిబ్బంది ఉండాల్సి ఉంది. ఏఈ తప్ప.. సిబ్బంది లేరు. ఏఈ కూడా సరిగా అందుబాటులో ఉండట్లేదనీ, కిందిస్థాయి సిబ్బంది సైతం అంతంతమాత్రంగానే విధులకు హాజరవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ట్రాన్స్‌ఫార్మర్లు త్వరలో పంపిణీ చేస్తాం

మండలంలో ఎక్కడ విద్యుత్ సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తాం. సిబ్బంది అందుబాటులో లేకపోయినా, ప్రైవేటు కార్మికులతోనైనా పనులు చేయిస్తాం. రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు త్వరలోనే పంపిణీ చేస్తాం.

- సాలేహబాషా, ట్రాన్స్‌కో ఏఈ, నంబులపూలకుంట



మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యకుమార్ యాదవ్

అభివృద్ధి చేసి చూపుతాం

క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యం

వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ బాధ్యతల స్వీకరణ



పూజలు చేస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, జూన్ 16: అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపుతామని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్యవిద్య శాఖల మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉద్ఘాటించారు. అమరావతిలోని తన చాంబర్‌లో ఆయన.. సతీమణి త్రివేణి, కుమార్తె సంస్కృతితో కలిసి ఆదివారం మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ చాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనాచౌదరితో కలిసి మంత్రి సత్యకుమార్ మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అక్రమాలు, భూకబ్జాలను వెలికితీసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి పేదకు మేలైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. క్యాన్సర్ రహిత ఏపీ దిశగా పనిచేస్తామన్నారు. ఆ మేరకు రాష్ట్ర ప్రజలకు స్ర్కీనింగ్ చేసేలా రెండో ఫైల్‌పై సంతకం చేశానన్నారు. క్యాన్సర్‌ను గుర్తించి, మ్యాపింగ్ చేయడంతోపాటు అవగాహన కూడా కల్పిస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్రం పెద్దల ఆశీస్సులతో తనను నమ్మి ఈ పదవి ఇచ్చారనీ, వారి నమ్మకాన్నివమ్ము చేయకుండా పదవికి న్యాయం చేస్తానని ఆయన ఉద్ఘాటించారు. కార్యక్రమంలో ధర్మవరానికి చెందిన కూటమి నాయకుడు రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.



కుమార్తె సంస్కృతిని ఆప్యాయంగా హత్తుకుంటున్న సత్యకుమార్

కష్టపడి గెలిచాం..
అభివృద్ధి చేసుకుందాం..

దౌర్జన్యాలు వద్దు

కూటమి శ్రేణులకు ఎమ్మెల్యే కుందికుంట పిలుపు





అభిమానులతో కందికుంట వెంకట ప్రసాద్ కరచాలనం, సమావేశంలో మాట్లాడుతూ..

కదిరి, జూన్ 16: ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి సాధించుకున్న అధికారంతో కదిరి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడదామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం కూటమి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. పోరాటం చేసి ఎన్నికల్లో గెలుపొందామన్నారు. కేంద్రం, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ అధికారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికే ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇన్నాళ్లూ వైసీపీలో ఉంటూ.. తమ కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. కూటమిలో చేరేందుకు వారు సిద్ధంగా ఉన్నారనీ, ఆ అవకాశం ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. అనంతరం వచ్చిన వారందరికీ విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, పర్వీనాభాను, క్రిష్ణమోహన్‌నాయుడు, బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ భైరవప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పండుగ ప్రశాంత వాతావరణంలో చేసుకోండి

ఎస్పీ మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, జూన్ 16: మత సామరస్యానికి ప్రతీకగా బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో ముస్లింలకు సూచించారు. సోమవారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. మసీదులు, మదరసాలు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టాలన్నారు. గోవధ చేయరాదని ఎస్పీ సూచించారు. జిల్లాలోని ముస్లింలందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

రేపు కేంద్ర కరువు బృందం రాక

పుట్టపర్తిరూరల్, జూన్ 16: జిల్లాలో రబీ కరువు పరిస్థితిని పరిశీలించడానికి కేంద్ర బృందం ఈనెల 18న జిల్లాకు రానున్నట్లు జిల్లా అధికార వర్గాలు ఆదివారం ప్రకటనలో తెలిపాయి. ఈనెల 21 వరకు జిల్లాలోని కరువు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తుందన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది.

వేలం ముగిసినా వసూళ్లు!

పెనుకొండ వారపు సంతలో వైసీపీ దందా



వసూళ్లకు పాల్పడుతున్న వైసీపీ బినామీ (తెల్ల చొక్కా)

పెనుకొండ టౌన్, జూన్ 16: పట్టణంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారపుసంతలో వైసీపీ నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. సుంకం వసూళ్లకు గడువు ముగిసినా అక్రమ దందా సాగిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ వైసీపీ నాయకులు జేబులు నింపుకుంటున్నారు. ఆదివారం పెనుకొండలో నిర్వహించిన వారపుసంతలో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ దొరికిపోయారు.

చైర్మన్ అనుచరులమంటూ దందా..

నగర పంచాయతీ చైర్మన్ అనుచరులమంటూ వారపుసంతలో సుంకాల దందా చేస్తున్నారు. రసీదు కూడా ఇవ్వట్లేదు. నగర పంచాయతీలో 18మంది కౌన్సిలర్లున్నారు. వారందరికీ వాటాలు ఇవ్వాలని బహిరంగంగానే వసూళ్లకు పాల్పడుతున్నారు.

మార్చి 31కే ముగిసిన గడువు

వారపుసంతలో సుంకం వసూళ్లకు గతేడాది మార్చి31న వేలంపాట నిర్వహించారు. ఈ యేడాది మార్చి 31తో గడువు ముగిసింది. సుంకం వసూళ్లు మాత్రం ఆగట్లేదు. అనధికారికంగా వసూలు చేస్తూనే ఉన్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. వైసీపీ నాయకుల బినామీలు సంతలో అక్రమంగా సుంకాలు వసూలు చేస్తున్నారు. రసీదు అడిగితే వచ్చేవారం నుంచి దుకాణం పెట్టవద్దని బెదిరిస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు.. ఈ అక్రమ వసూళ్లకు చెక్ పెట్టాలని వ్యాపారులు కోరుతున్నారు.

క్రిమినల్ చర్యలు తీసుకుంటాం



ఈ ఏడాది మార్చి 31తో సుంకాల వసూళ్ల గడువు ముగిసింది. నగర పంచాయతీ సిబ్బంది మాత్రమే సుంకాలు వసూలు చేయాలి. ప్రైవేటు వ్యక్తులు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ఎన్నికల కారణంగా వేలంపాట ఆలస్యమైంది. త్వరలో వేలం నిర్వహిస్తాం.

- వంశీకృష్ణ భార్గవ్, నగర పంచాయతీ కమిషనర్

గింజలులేని కంకి

నిండా మునిగిన మొక్కజొన్న రైతు



గింజలులేని మొక్కజొన్నను చూపుతున్నరైతు

నంబులపూలకుంట, జూన్ 16: విత్తన మొక్కజొన్న సాగుచేసి ఓ కౌలురైతు తీవ్రంగా నష్టపోయాడు. కంకి గింజలు ఏర్పడకపోవడంతో నిండా మునిగినట్లు మండల కేంద్రానికి చెందిన రైతు గంగప్ప ఆదివారం వాపోయాడు. స్థానిక నల్లగంగమ్మ ఆలయం సమీపాన ఎకరా పొలాన్ని గంగప్ప కౌలుకు తీసుకుని, విత్తన మొక్కజొన్న సాగుచేశాడు. రూ.50వేలు పెట్టుబడి పెట్టాడు. జనవర్లో పంట వేశాడు. కంకికి గింజలు ఏర్పడలేదు. కంకికి పది గింజలు వృద్ధి చెందలేదు. నూర్పిడి చేయిద్దామన్నా.. కూలీ ఖర్చులు కూడా దక్కవని రైతు వాపోతున్నాడు. కూలి చేసుకుని జీవనం సాగించే తాను పెట్టుబడికి చేసిన అప్పులు ఎలా కట్టాలోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

117 జీఓను వెంటనే రద్దు చేయాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కొత్తచెరువు, జూన్ 16: వైసీపీ ప్రభుత్వం 177 జీఓను తీసుకొచ్చి ప్రాథమిక విద్యావ్యవస్థను విచ్ఛిన్నం చేసిందనీ, వెంటనే దానిని రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కోనంకి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం117 జీఓను వెంటనే రద్దు చేసి, ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు కోడూరు శ్రీనివాసులు, ఆర్ చంద్ర, గౌరవాధ్యక్షుడు పీవీ మాధవ, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోనంకి అశోక్‌కుమార్

రామచరితం.. చూసిన కనులదె భాగ్యం..



నాటికలోని సన్నివేశం

పుట్టపర్తి, జూన్ 16: స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభామండపంలో సత్యసాయి బాలవికాస్ చిన్నారులు ఆదివారం ప్రదర్శించిన రామచరిత నృత్యరూపకం భక్తులను అలరింపజేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు రెండోరోజు కూడా కొనసాగాయి. మొదట సాయిప్రేమవాహిని పేరిట యువత నాటకాన్ని ప్రదర్శించారు. సత్యసాయి సూచించిన మానవసేవే మాధవసేవ అన్న రీతిలో నిర్వహిస్తున్న వైద్యసేవలపై నాటికను ప్రదర్శించారు. సాయిబాటలో సత్యసాయి సేవాసంస్థలు సైతం సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయంటూ నాటిక ద్వారా తెలియచేశారు. అనంతరం బాలవికాస్ చిన్నారుల రామాయణ ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు. చిన్నారుల నృత్యానికి భక్తులు తన్మయత్వం చెందారు. అనంతరం సేవాదళ్ బృందానికి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ శ్వేత వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఘనంగా బ్రహ్మంగారి విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన బ్రహ్మంగారి విగ్రహం

ఓబుళదేవరచెరువు, జూన్ 16: మండలంలోని ఎం. కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. వీర బ్రహేంద్రస్వామి, గోవిందమాంబ దంపతుల విగ్రహ ప్రతిష్ఠను పురోహితుడు పంచ రత్న సురేష్‌శర్మ వేదమంత్రోచ్ఛారణలతో, ప్రత్యేక పూజలతో చేపట్టారు. భక్తు లు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చర్ల అంజనేయుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం


మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లాసహాయ కార్యదర్శి జేవీరమణ

ధర్మవరం, జూన్ 16: గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని చంద్రబాబు అధికారంలోకి రాగానే రద్దు చేయడం హర్షనీయమని ఏపీ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి జేవీరమణ అన్నారు. పట్టణంలోని రైతుసంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టం తీసుకొచ్చిందన్నారు. ఆ చట్టాన్ని రద్దు చేయాలని రైతుసంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేశామని, ఫలితం లేకపోయిందని తెలిపారు. ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి రాగానే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అందుకు రైతులు, ప్రజలు ఆయన్ను గెలిపించారని తెలిపారు. అధికారంలోకి రాగానే చంద్రబాబు ఇచ్చిన మాట నెలబెట్టుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు సీఎంకు రైతుసంఘం రాష్ట్ర సమితి తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా అక్షరాభ్యాసం


చిన్నారులకు పలకలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఓబుళదేవరచెరువు, జూన్ 16: మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో ఆదివారం ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయుల ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలుత పురోహితుడు పంచ రత్నం సురేష్ శర్మ స్థానిక గణపతి విగ్రహానికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం 186 మంది చిన్నారులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు దాత కోడూరు శ్రీకాంత్ పలకలు, బలపాలు అందించారు. అమడగూరు మండలానికి చెందిన మాతృశ్రీ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు అరుణజ్యోతి అన్నదానం చేపట్టారు.

ప్రభుత్వ బడులకే 'తల్లికి వందనం' వర్తింపజేయాలి

ఓబుళదేవరచెరువు, జూన్ 16: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని 1998 ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం వారు పుట్టపర్తిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందన్నారు. తల్లికి వందనం పథకం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. అప్పుడే ఆ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కమ్మల నాగరాజు, నాయకులు చెన్నకేశవులు, సునీల్‌కుమార్, తుమ్మలప్ప, శంకర్‌నాయుడు, రఘువీరారెడ్డి ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న భవన కార్మికులు

ఓబుళదేవరచెరువు, జూన్ 16: మండల కేంద్రంలో ఆదివారం సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఇందులో మండల వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సమస్యలపై కూడా చర్చించారు. వీటిని ప్రభుత్వానికి విన్నవించి పరిష్కరించుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ పట్ల డీటీఎఫ్ హర్షం

ఓబుళదేవరచెరువు, జూన్ 16: సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీ విడుదలపై సంతకం చేయడం హర్షణీయమని డీటీఎఫ్(డెమోక్రటిక్ టీ చర్ ఫెడరేష్) రాష్ట్ర కార్యదర్శి షర్ఫొద్దీన్, జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో టీటీసీ, బీఈడీ చేసిన వారు చాలామంది ఉపాధ్యాయ ఖాళీలు భర్తీగాక ఎన్నోయేళ్లగా ఎదురు చూస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీ ప్రకటించడం నిరుద్యోగులకు వరం లాంటిదన్నారు. ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు పెంచాలని, జీవో 117ను రద్దు చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహులు, సోమశేఖర్ ఉన్నారు.

నయనానందకరం.. శ్రీవారి కల్యాణం

హిందూపురం అర్బన్, జూన్ 16: పట్టణ పరిధిలోని లక్ష్మీపురంలో వెలసిన బాలాజీ ఆలయంలో గోదాదేవి, లక్ష్మీదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం నయనానందకరంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారి మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు చేసి బెంగళూ రు నుంచి తెప్పించిన పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11.15 నిమిషాలకు కర్కాటక లగ్న మందు వేదపండితుల మంత్రోచ్ఛారణ, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీవారి కల్యాణా న్ని తిలకించారు. అనం తరం అన్నదాన కార్యక్ర మం చేపట్టారు. సాయంత్రం విద్యాధరి కళానిలయం వారిచే నిర్వహించిన నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.


పూజలు అందుకుంటున్న వెంకటేశ్వర స్వామి


ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

నాణ్యమైన సరుకులను అందిస్తాం: ఆర్డీఓ


ధర్మవరం స్టాక్‌పాయింట్‌లో సరుకులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

ధర్మవరం, జూన్ 16: ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను అందజేస్తామని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం ఆయన ధర్మవరం, ముదిగుబ్బ, చెన్నేకొత్తపల్లి స్టాక్ పాయింట్లను తనిఖీ చేసి అందులోని కందిపప్పు, నూనెను పరిశీలించారు. అలాగే చక్కెర నిల్వ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎక్కడ ఎటువంటి పొరపాటు లేకుండా చూడాలని స్టాక్ పాయింట్ సిబ్బందికి సూచించారు. అనంతరం మాట్లాడుతూ రేషన్ కార్డు లబ్ధిదారులకు చౌకదుకాణాల్లో నాణ్యమైన సరుకులను అందజేస్తామని తెలిపారు. ఆర్డీఓ వెంట అధికారులు లక్ష్మీదేవి, శారద, రమాదేవి, హంపయ్య, ఈశ్వరయ్య ఉన్నారు.

ఘనంగా దేవర ఎద్దుల వేల్పు

- పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట


దేవర ఎద్దు పూజలో ఎమ్మెల్యే కందికుంట

తనకల్లు, జూన్ 16: మండలంలోని రాచినేపల్లి గ్రామంలో ఆదివారం దేవర ఎద్దుల వేల్పు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 20 ఏళ్లకు ఒకసారి ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో సాంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో రాచినేపల్లి గ్రామస్థులంతా దేవర ఎద్దుల వేల్పును పెద్దఎత్తున నిర్వహించారు. కార్యక్రమానికి తనకల్లు మండలం చిన్నపల్లి, నంబులపూలకుంట మండలం మేకలచెరువు, గాండ్లపెంట మండలం కోటూరు, నల్లచెరువు మండలం బాలినేని ఎగువ, దిగువ తండాలు, పూలకుంటపల్లి, కదిరి మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల గ్రామాలకు చెందిన దేవరెద్దులు కార్యక్రమంలో పాల్గొన్నాయి. శ్రీనివాచారులు వేదమంత్రాలతో పూజలు చేశారు. కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాలతో పాటు అన్నమయ్య జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. పూజల అనంతరం రాచినేపల్లి గ్రామస్థులు దేవర ఎద్దుల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.


దేవర ఎద్దుల వేల్పులో పాల్గొన్న భక్తజనం

పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట :

దేవర ఎద్దుల వేల్పు కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. దేవర ఎద్దులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నేటికి సంప్రదాయంగా దేవర ఎద్దుల వేల్పు నిర్వహించ డం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రామస్థులను అభినందించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

- జనసేన నేత చిలకం మధుకు కేజీబీవీ ఉద్యోగుల వినతి


చిలకం మధుకు వినతిపత్రం ఇస్తున్న కేజీబీవీ ఉద్యోగులు

ధర్మవరం, జూన్ 16: తమ సమస్యలను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కేజీబీవీ పాఠశాల ఉద్యోగులు జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. పట్టణంలోని కస్తూర్బాగాంధీబాలికల విద్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు శంకరమ్మ, గీత, సువర్ణ, లక్ష్మీ తదితరులు స్థానిక జనసేన కార్యాలయంలో ఆదివారం చిలకం మధుసూదన్‌రెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కేజీబీవీల్లో 4,579 మంది కాంట్రాక్టు ఉద్యోగులుగా కొనసాగుతున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం మమ్మల్ని క్రమబద్ధీకరిస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా న్యాయం జరిగేలా చూడాలని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చిలకంను కోరారు. స్పందించిన ఆయన సమస్యలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అనంత నగరానికి అరుదైన గౌరవం

- బ్రిక్స్ దేశాల మేయర్ల సదస్సుకు నగర మేయర్‌కు ఆహ్వానం

అనంతపురం క్రైం, జూన్ 16: అనంతపురం నగరానికి అరుదైన గౌరవం లభించింది. ఈనెల 21న రష్యాలో నిర్వహించే బ్రిక్స్ దేశాల మేయర్ల సదస్సుకు హాజరవ్వాలని ఆ దేశంలోని కజాన్ మేయర్ నుంచి నగర మేయర్ మహమ్మద్ వసీంకు ఆహ్వానం అందింది. ఈ సమావేశంలో వివిధ దేశాలకు చెందిన 50 మందికి పైగా మేయర్లు హాజరవుతున్నారు. రాష్ట్రం నుంచి అనంతపురం నగర మేయర్‌కు మాత్రమే ఆ అవకాశం దక్కింది. ప్రయాణ ఖర్చులతో పాటు ఇతర సౌకర్యాల ఖర్చులను రష్యా ప్రభుత్వమే భరించనుంది.

ఆహ్వానం ఎందుకంటే...

అనంతపురం నగరానికి రష్యా దేశంతో ఉన్న అనుబంధంతోనే ఈ నగరాన్ని ఎంపిక చేశారు. 16వ శతాబ్దంలో ప్రథమ రష్యన్ యాత్రికుడు అఫానసీ నికితిన్ విజయనగర సామ్రాజ్యంలో భాగమైన అనంతపురాన్ని సందర్శించారు. ఈ సందర్శనకు సంబంధించిన అంశాలు ఇటీవల కజాన్‌లో జరిగిన అసోసియేషన్ వ్యవస్థాపక సమావేశంలో అనంతపురం ప్రాధాన్యతను గుర్తుచేశాయి. భారత దేశం నుంచి జైపూర్, క్యాలికట్, త్రిశూర్, నాగర్ కోయిల్‌తో పాటు అనంతపురం నగరాన్ని ప్రాతిపదికన ఈ నగరాన్ని తీసుకున్నారు. అందులో భాగంగా నగర ప్రథమ పౌరుడైన మేయర్‌కు ఆహ్వానం పంపారు. అనంతపురం నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ప్రజలందరి విజయంగా భావిస్తున్నానని మేయర్ వసీం అన్నారు.

బీసీ బాలుర హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాలి


ప్రహరీ లేని బీసీ బాలుర వసతి గృహం

నంబులపూలకుంట, జూన్ 16: మండలకేంద్రంలో బీసీ బాలుర వసతి గృహానికి ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయింది. కదిరి- రాయచోటి ప్రధాన రహదారి పక్కనే వసతి గృహం ఉంది. కాగా దానికి ప్రహరీ నిర్మించలేదు. దీంతో విద్యార్థులు పరుగులు తీస్తూ రోడ్డు పైకి వెళ్తున్నారని, అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచిఉందని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రహరీ నిర్మించాలని చెబుతున్నారు. గురువారం పాఠశాల పునఃప్రారంభమయిందని, వసతిగృహంలోకి విద్యార్థులు చేరుతున్నారనీ, వెంటనే ప్రహరీ నిర్మించాలని వారు కోరుతున్నారు.

మూసుకుపోయిన కల్లుబాయి తండా రోడ్డు

- ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు
- గ్రామస్థులకు తప్పని తిప్పలు


కల్లుబాయి తండా రహదారికిరువైపులా పెరిగిన ముళ్ల కంపలు

గాండ్లపెంట, జూన్ 16: మండలంలోని గాజువారిపల్లి పెద్దతండా పంచాయతీ కల్లుబాయి తండాకు వెళ్లే రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో కొమ్మలు విపరీతంగా పెరగడంతో దారి మూసుకుపోతోంది. ఈ క్రమంలో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉందని కల్లుబాయి తండావాసులు వాపోతున్నారు. గాజులవారిపల్లినుంచి తమ తండాకు దాదాపు అరకిలోమీటరు దూరం ఉంటుందని, రహదారికి ఇరువైపులా కంపచెట్లు భారీగా పెరిగిపోయాయని, కొమ్మలు రోడ్డుకు అడ్డుగా ఉన్నాయని, వాహనదారులు, పాదచారులు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని అంటున్నారు. అలాగే ఈరహదారికి అధికంగా మలుపులుండడంతో కంపల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనపడడం లేదని, ఈ క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు, పాలకులు రోడ్డుకు ముళ్ల కంపలు తొలగించాలని వారు కోరుతున్నారు.

నాన్నే.. నా రియల్ హీరో..

- తండ్రికి ఫాదర్స్‌డే శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


తండ్రి శంకరరెడ్డికి స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి

పుట్టపర్తి, జూన్ 16: నా తండ్రి నా ప్రత్యక్షదైవం, నా రియల్ హీరో అంటూ ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి పేర్కొన్నారు. ఫాదర్స్‌డే సందర్భంగా ఆదివారం ఆమె పట్టణంలోని నివాసంలో తన తండ్రి శంకరరెడ్డికి పాదాభివందనం చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. తల్లి నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిస్తే .. తండ్రి ఆ బిడ్డ చేయి పట్టుకుని ఉన్నత శిఖరాల వైపు నడిపించేందుకు జీవితాన్నే త్యాగం చేస్తారన్నారు. తండ్రికి ఎంత సేవ చేసినా రుణం తీరదన్నారు. ఎంతపని ఒత్తిడిలో ఉన్నా.. నేను కనిపిస్తే ఆ ఒత్తిడి మాయమయ్యేదని నా తండ్రి తెలిపేవారన్నారు. తన తండ్రి పోలీసువృత్తిలో నిత్యం ఒత్తిళ్లతో ఉన్నా నాఆశయాల కోసం నిరంతరం పరితపించారంటూ ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి పల్లె పరామర్శ


మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న పల్లె

నల్లమాడ, జూన్ 16: మండలంలోని నల్లశింగయ్యగారి పల్లి గ్రామానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆదివారం ఆ గ్రామానికెళ్లి మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పల్లె వెంట పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ధర్మవరం,జూన్ 16: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. రైల్వే జీఆర్‌పీ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని తారకరామాపురానికి చెందిన నాగరాజు ఆదివారం మధ్యాహ్నం స్థానిక రైల్వేస్టేషన్‌లో తిరుపతికి వెళ్లే రైలును కదులుతుండగా ఎక్కాడు. దీంతో ప్రమాదవ శాత్తూ కాలు జారి రైలు కింద పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాగరాజు రైల్లో తినుబండారాలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకునేవాడని స్థానికులు పేర్కొన్నారు.

అమగొండపాళ్యం సర్పంచ్ మృతి


రామచంద్రనాయుడు (ఫైల్)

పుట్టపర్తి రూరల్, జూన్ 16: మండలంలోని అమగొండపాళ్యం సర్పంచు రామచంద్రనాయుడు (52) ఆదివారం మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవారని, పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారని కుటుంబసభ్యులు తెలిపారు. ఇతడికి భార్య వసుందర, ఇద్దరు కుమారులు ఉన్నారు. సర్పంచు మృతి పట్ల గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేశారు.

మహిళ ఆత్మహత్య

నంబులపూలకుంట, జూన్ 16: మండలంలోని పెడబల్లిలో మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తలుపుల మండలం గంజివారిపల్లికి చెందిన మల్లికకు(28) పదేళ్ల క్రితం పెడబల్లికి చెందిన ఖాసీంబాషాతో వివాహమైంది. కాగా గత కొన్నినెలలుగా ఆమె కడుపునొప్పితో బాధపడుతుండేది. శనివారం రాత్రి నొప్పి తీవ్రమవడంతో తాళలేక ఇంట్లో ఎవరూ లేనిది చూసి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫాతిమా ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

యువకుడి ఆత్మహత్య


పవన్‌కుమార్(ఫైల్)

కొత్తచెరువు, జూన్ 16: మండల కేంద్రానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన చంద్రప్పగారి రవి కుమారుడు పవన్ కుమార్ (29) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా అతడికి షుగర్ వ్యాధి ఉంది. దీంతో చిన్నతనంలోనే షుగర్ రావడంతో మానసికంగా కృంగిపోతుండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి తీవ్ర మనోవేదనకు గురై హైదరాబాద్‌లోని అద్దె గదిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ యువకుడు గతంలో కొత్తచెరువు మండల జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సేవాకార్యక్రమాలు చేసేవాడు. ఆదివారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడంతో ఎన్టీఆర్ అభిమానులు వచ్చి నివాళులర్పించారు.

ఏపీఎన్జీఓల సంఘం తాలూకా కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి

ధర్మవరం, జూన్ 16: ఏపీఎన్జీఓ సంఘం తాలూకా కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు ఆ సంఘం అధ్యక్షుడు ఉరుకుందప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆ సంఘం సభ్యులు ఆదివారం పట్టణంలోని ఎన్జీఓ కార్యాలయంలో సన్మానించారు.

100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు సహకరించండి

పుట్టపర్తి, జూన్ 16: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు సహకరించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను బీజేపీ కల్లుగీత కార్మికుల సంఘం రాష్ట్ర కన్వీనర్ తలమర్ల హరికృష్ణగౌడ్, పార్టీ జిల్లా మీడియా కోఆర్డినేటర్ జ్యోతిప్రసాద్, జిల్లా కోశాధికారి సురేంద్రబాబు తదితరులు కోరారు. విజయవాడలోని సచివాలయంలో ఆదివారం ఆరోగ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సత్యకుమార్‌ను వారు కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పుట్టపర్తిలో 100 పడకల ఆస్పతిని ఏర్పాటు చేయాలని మంత్రిని కోరామన్నారు.

రోడ్డు ప్రమాదంలో తమిళనాడు వాసి మృతి

చెన్నేకొత్తపల్లి, జూన్ 16: సీకేపీకి సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కన ఓ డాబా వద్ద నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ శనివారం రాత్రి ఢీ కొన్న ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా గాంధీనగర్ చిట్టిచావిడి కరుప్పూర్‌కు చెందిన శంకర్ (40) అక్కడికక్కడే మరణించాడు. ఇతను లారీ యజమాని. లారీ డ్రైవర్ రాజుతో కలిసి ఇతను తన లారీలో పెనుకొండ నుంచి అనంతపురం శనివారం రాత్రి బయలుదేరాడు. రహదారి పక్కన ఓ డాబా వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న మరో లారీ వీరు వెనకు నుంచి ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో క్యాబిన్‌లో ఉన్న శంకర్ అక్కడికక్కడే మరణించాడు. డ్రైవర్ రాజు తీవ్రంగా గాయపడగా.. స్థానికులు అతడిని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి అన్న వడివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

నియామకం

ఓబుళదేవరచెరువు, జూన్ 16: పాల ఏకిరి సంఘం నియోజకవర్గ టీడీపీ బీసీ సాధికారిక కమిటీ సభ్యుడిగా మిట్టపల్లికి చెందిన యనుముల ఆంజనేయులనాయుడును నియమించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఈ మేరకు నియామకపత్రాన్ని తనకు అందజేసినట్లు ఆంజనేయులు విలేకరులకు తెలిపారు. పాల ఏకిరుల సమస్యలపై దృష్టి సారించి, పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు.

మొబైల్ షాప్‌లో చోరీ..

ముదిగుబ్బ,జూన్16: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఉన్న ఒక మొబైల్ షాప్‌లో శనివారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు దామోదర్ ఆదివారం తెలిపి మేరకు వివరాలిలా ఉన్నాయి. మొబైల్ షాప్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి సెల్‌ఫోన్లు, వాటి సామగ్రిని అపహరించారన్నారు. ఆదివారం ఉదయం షాప్ తెరిచి చూడగా విషయం తెలిసిందన్నారు. రూ. 25వేలు విలువ చేసే సామగ్రి అపహరణకు గురైనట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశానని, వారు దర్యాప్తు చేపట్టారని చెప్పారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు

● పర్యవేక్షించిన కలెక్టర్, జేసీ



జేఎన్‌టీయూలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్నకలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జూన్16: జిల్లాలో యూపీఎస్సీ (సివిల్ సర్వీసెస్) పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాకేంద్రంలో జేఎన్‌టీయూ, ఎస్కేయూ, ఎస్ఎస్‌బీఎన్, ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాలలో కలిపి ఏడు కేంద్రాలలో ఆదివారం పరీక్షలు నిర్వహించారు. మొత్తంమీద 2795 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంది. ఉదయం 1462 మంది హాజరుకాగా 1333 మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం 1456 మంది హాజరు కాగా 1339 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. నీట్ పరీక్షల వివాదం నేపథ్యంలో యూపీఎస్సీ పరీక్షల నిర్వహణ విషయంలో కలెక్టర్, జేసీ కేతన్‌గార్గ్ ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షించారు. జేఎన్‌టీయేలో కలెక్టర్, ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో జేసీ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద మెటల్ డిటెక్టర్‌లు ఏర్పాటు చేసి అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోనికి అనుమతించారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు కొనసాగించారు. జవాబు పత్రాల బుకింగ్ విషయంలో కూడా కలెక్టర్ హెడ్ పోస్టాఫీస్‌కు స్వయంగా వచ్చి బుకింగ్ తీరును పరిశీలించారు. మొత్తంమీద పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో జిల్లా యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

రేగాటిపల్లికి చేరిన సైనికుల బైక్ యాత్ర

ధర్మవరం, జూన్ 16: కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులను స్మరించుకుంటూ భారత సైనికులు చేపట్టిన బైక్ యాత్ర ఆదివారం ధర్మవరం మండలం రేగాటిపల్లికి చేరుకుంది. సైన్యాధికారి అజయ్‌కుమార్ ఠాకూర్ మాట్లాడుతూ.. తమిళనాడులోని ధనుష్‌కోటిలో గత నెలలో బైక్‌యాత్ర ప్రారంభించామన్నారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులను స్మరించుకుంటూ, వారు దేశం కోసం చేసిన త్యాగాలను ప్రజలకు వివరిస్తూ ఈ యాత్ర చేపట్టామన్నారు.కార్గిల్ యుద్ధం జరిగి 25 ఏళ్లు పూర్తయిందన్నారు. మనాలి, లద్దాఖ్ వరకు 5వేల కిలోమీటర్లు బైక్ యాత్ర చేపడతామన్నారు.



బైక్‌యాత్ర చేపట్టిన సైనికులు

ఓట్లు వేయరా... తడాఖా చూపుతాం..!

● వైసీపీ నేతల కక్షసాధింపు.. తాగునీరు బంద్
● అల్లాడిపోతున్న గ్రామాల ప్రజలు
● జగన్ మత్తు వీడని గ్రామ కార్యదర్శులు
● బోరు మరమ్మతులు చేయించిన టీడీపీ కార్యకర్తలు

బుక్కరాయసముద్రం, జూన్ 16: వైసీపీని ప్రజలు ఛీ కొట్టినా... ఆ పార్టీ నాయకుల తీరు మారలేదు. శింగనమల నియోజకవర్గంలో అత్యధికంగా గ్రామ పంచాయతీల్లో వైసీపీ మద్దతు సర్పంచులే ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలలో ఆ పార్టీ ఓటమి చవి చూసింది. నిజ్జి జీర్ణించుకోలేక కొందరు ఆ పార్టీ సర్పంచులు, గ్రామ నాయకులు ప్రజలపై కక్షసాధిస్తున్నారు. వైసీపీకి ఓట్లు వేయకుండా టీడీపీకి ఓట్లు వేస్తారా? మా తడఖా ఏంటో చూపిస్తామని సర్పంచ్‌లు రెచ్చిపోతున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన మరసుటి రోజు నుంచే ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా వారు వ్యవహరిస్తున్నారు. గ్రామాలకు తాగునీరు రాకుండా బంద్ చేయిస్తున్నారు. వీటితో గ్రామాల్లో కార్మికులు కాలువలు శుభ్రం చేయకుండా, చెత్త సేకరణ తదితర పనులను తాత్కాలికంగా నిలిపివేయించారు. శింగనమల నియోజకవర్గంలో పలు గ్రామ పంచాయతీలలో ప్రజలపై కక్షసాధింపు చర్యలుకు దిగుతున్నా... గ్రామ సెక్రటరీలు మౌనంగా ఉండటం విశేషం. ప్రభుత్వం మారినా పలు గ్రామాల్లో కార్యదర్శులు వైసీపీ మత్తులోనే ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



బుక్కరాయసముద్రం గ్రామ సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

మేజర్ గ్రామ పంచాయతీలో తాగునీరు బంద్

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బుక్కరాయసముద్రం మేజర్ గ్రామ పంచాయియతీలో ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే తాగునీరు బంద్ చేయించారు. దీంతో గ్రామంలోని ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలో 4 వేల ఓట్లు టీడీపీకి మెజార్టీ రావడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక ఈ దుశ్చర్యకు దిగినట్లు ప్రజలు అంటున్నారు. సాధారణంగా ఒకటి రెండు చోట్ల తాగునీటి సమస్య రావడం సహజం. ఏకంగా 8 నుంచి 9 కాలనీలల్లో సమస్య ఉందనే విధంగా చిత్రీకరించారు. పంచాయతీలో 40 వేల జనభా ఉంది. ప్రస్తుతం కొళాయిల్లో నీరు రాకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. నీటి సమస్య తట్టుకోలేక గ్రామ సచివాలయం వద్ద మహిళలు ధర్నా చేపట్టారు. అయినా అధికారులలో ఎలాంటి స్పందన రాలేదు. వీటితో పాటు పంచాయతీ కార్మికులు డ్రైనేజీలు, రోడ్లు శుభ్రం చేయడానికి రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు ముందు నీరు వచ్చేదని, ప్రస్తుతం రాకుండా చేశారని విమర్శిస్తున్నారు. నియోజకవర్గంలో వైసీపీ గ్రామ సర్పంచ్‌లు ఉన్న గ్రామాల్లో తాగునీటి సమస్య వచ్చినా, ఇతర సమస్యలు వచ్చినా అధికారులు, సర్పంచులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



పుట్లూరులో ట్యాంకర్లతో నీటిని అందిస్తున్న టీడీపీ నాయకులు

బోరును మరమ్మతు చేయించిన టీడీపీ కార్యకర్తలు

టీకేఎస్‌లోని జనచైతన్య కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పలుసార్లు ప్రజలు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. కాలనీలో అత్యధికంగా ముస్లిం మైనార్టీ వర్గాలు నివసిస్తున్నారు. సోమవారం బక్రీద్ పండుగ నేపథ్యంలో ఇబ్బందుపడుతున్నారని వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులును వేడుకున్నారు. ఎన్నికల్లో ఓట్లు వేయలేదని ఉద్దేశంతోనే తాగునీటి బోరు మరమ్మతు చేయలేదని అంటున్నారు. టీడీపీ కార్యకర్తలు రంగమ్మ, రఫీ, వలీ సొంత డబ్బు పెట్టి తాగునీటి బోరుకు మరమ్మతు చేయించి నీటిని సరఫరా చేయించారు. వీటితో పాటు పుట్లూరు మండల కేంద్రంలో గతంలో తాగునీటి సమస్య నెలకొంది. గ్రామ పంచాయతీ సర్పంచ్ వైసీపీకి చెందిన వాడు కావడంతో అక్కడ ఉన్న స్థానిక నాయకులు తాగునీటి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు గతంలో నీటిని అందించేవారు. ఎన్నికల ఫలితాలు అనంతరం ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని అందించడం లేదు. స్వయంగా టీడీపీ నాయకుడు పుల్లారెడ్డి సొంత డబ్బుతో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని అందిస్తున్నారు.



బోరుకు మరమ్మతు చేయిస్తున్న టీడీపీ కార్యకర్తలు

కక్షసాధింపు చర్యలుకు దిగితే సహించం



నియోజకవర్గంలో వైసీపీకి ఓట్లు వేయలేదని ప్రజలపై కక్షసాధింపు చర్యలకు దిగితే సహించే ప్రసక్తిలేదు. అధికారులు ఇంకా వైసీపీ మత్తులో ఉంటే వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. వెంటనే తాగునీరు బంద్ చేసిన గ్రామాల్లో నీటిని ఇవ్వాలి. పంచాయతీ కార్మికులు కూడా ప్రజలకు అనుగుణంగా పని చేయాలి. సర్పంచ్‌లు చెప్పిన విధంగా చేయవద్దద. ఎన్నికలలో వైసీపీకి బుద్ధిచెప్పినా వారి తీరు మారలేదు.

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ఎమర్జెన్సీకి చికిత్స ఏదీ..?

దయనీయంగా పెద్దాస్పత్రి క్యాజువాలిటీ, ఐసీయూ

విరిగిపోయిన మంచాలు.. పనిచేయని ఏసీలు

ఇంటి నుంచే ఫ్యాన్లు తెచ్చుకుంటున్న రోగులు



ఐసీయూలో ఏసీలు పనిచేయక ఇంటి నుంచే ఫ్యాన్ తెచ్చుకుని ఉపశమనం పొందుతున్న రోగి

అనంతపురం టౌన్, జూన్ 16: జిల్లా సర్వజన ఆసుపత్రి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రైవేటు ఆసుత్రులకు వెళ్లి చికిత్సలు పొందాలంటే వేలకు వేలు ఖర్చు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎలాంటి చికిత్సలైనా ఉచితంగా పొందవచ్చని పెద్దఎత్తున రోగులు వస్తుంటారు. రోజుకు రెండు వేల మంది వరకు ఆసుపత్రికి వచ్చి వైద్యం పొందుతున్నారు. దాదాపు 1200 మంది వరకు అడ్మిషన్ పొంది చికిత్సలు తీసుకుంటున్నారు. దీన్నిబట్టే జిల్లా ఆసుపత్రికి రోగులు ఏ స్థాయిలో వస్తారో అర్థమవుతుంది. ఇలాంటి ఆసుపత్రి పట్ల వైసీపీ ప్రభుత్వంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేశారన్న విమర్శలు ఉన్నాయి. సాధారణ చికిత్స విభాగాల మాట అటుంచితే ప్రాణాప్రాయ స్థితిలో రోగులు వస్తే కాపాడేందుకు ఏర్పాటు చేసిన క్యాజువాలిటీ, ఐసీయూ, ఎమర్జెన్సీ విభాగాల పరిస్థితి దుర్భరంగా ఉంది.

రోగులు ఫుల్.. వసతులు నిల్..

ఆసుపత్రికి ప్రాణాప్రాయస్థితిలో ప్రతిరోజు పదుల సంఖ్యలోనే కేసులు వస్తుంటాయి. ప్రమాదాలకు గురైన వారితో పాటు విషం తాగిన కేసులు, పాము, తేలుకాటుకు గురైన వారు, గుండె, బ్రెయిన్ తదితర కేసులు ఇక్కడికి వస్తుంటాయి. తొలుత క్యాజువాలిటీలో చేరతారు. అక్కడ ప్రథమ చికిత్సలు అందించి పక్కనే ఉన్న ఐసీయూలోకి పంపిస్తారు. క్యాజువాలిటీలోను, ఐసీయూలోను ఒక్కొక్క విభాగంలో 20 పడకలు మాత్రమే ఉన్నాయి. వచ్చే రోగులకు ఈ పడకలకు ఏమాత్రం సరిపోవడంలేదు. డాక్టర్లు నిర్లక్ష్యంగా ఏదో అరకొర వైద్యం అందించి ఏం పర్వాలేదు, బాగుందని చెప్పి పంపిస్తున్నారు. ఇటీవల అనంతపురం రూరల్‌కు చెందిన ఓ ఆటో డ్రైవర్ ప్రమాదానికి గురికాగా ఎమర్జెన్సీ చికిత్స కోసం క్యాజువాలిటీలో కుటుంబ సభ్యులు చేర్పించారు. అక్కడ ఉన్న డాక్టర్, సిబ్బంది అతడిని పరీక్షించి సూదులువేసి, మందులు రాసిచ్చి బాగున్నాడని, ఏమి ఇబ్బంది లేదని చెప్పి పంపించారు. ఇంటికి పోయిన తర్వాత అర్థరాత్రి మళ్లీ సీరియస్ కావడంతో తిరిగి ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఇక్కడికి వచ్చిన కాసేపటికే ఆటోడ్రైవర్ మరణించాడు. ఆసుపత్రి డాక్టర్లు బలవంతంగా బాగుంది పొమ్మంటే పోయామని, వాళ్ల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని ఆటో డ్రైవర్ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఇలాంటివి ఎన్నో ఉంటాయని, పడకల కొరత వల్లే డాక్టర్లు, సిబ్బంది ఇలా పంపించేసి వారి ప్రాణాలు తీస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

విరిగిన మంచాల కాళ్లు.. దిష్టిబొమ్మల్లా ఏసీలు..

ఎమర్జెన్సీ విభాగాలంటే సౌకర్యాలు మంచిగా ఉండాలి. అధికారులు, డాక్టర్లు వసతుల విషయంలో ఎప్పటికపుడు జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైన మరమ్మతులు చేయించాలి. పాలకులు సైతం వీటిపై దృష్టిసారించి ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ వైసీపీ ఐదేళ్ల పాలనలో కేవలం మాటలకే ఇవన్నీ పరిమితమైపోయాయి. అసలే మంచాలు తక్కువ ఉంటే అందులో కొన్నింటికి కాళ్లు ఊడిపోయాయి. మంచాలు కిందకు పడకుండా సపోర్టుగా ఇనుప స్టూల్స్ పెట్టి వాటిలోనే రోగులను ఉంచి వైద్యం అందిస్తున్నారు. ఎమర్జెన్సీ అంటేనే తప్పనిసరిగా ఏసీలు ఉండాలి. కానీ ఈ సర్వజన ఆసుపత్రిలో ఏసీలు కనిపిస్తున్నా అవి ఏళ్ల తరబడిగా పనిచేయలేదు. దిష్టి బొమ్మల్లా కనిపిస్తున్నాయి. ఏసీలు పనిచేయకపోవడంతో చాలామంది రోగులు ఇళ్ల నుంచి ఫ్యాన్లు తెప్పించుకొని ఉపశమనం పొందుతున్నారు. ఇటీవల దాదాపు రెండున్నర కోట్లతో ఆసుపత్రి, వైద్యకళాశాల, సూపర్ స్పెషాలిటీలలో మరమ్మతుల కోసం ఖర్చు పెట్టామని వైద్యాధికారులు, ఇంజనీర్లు అంటున్నారు. ఎమర్జెన్సీ విభాగాల్లో నెలకొన్న సమస్యలు కనిపించడంలేదా అనే విమర్శలు వస్తున్నాయి.



అనంత ఆసుపత్రిలోని క్యాజువాలిటీ విభాగంలోకి రోగులను తీసుకెళుతున్న సిబ్బంది, కుటుంబసభ్యులు



ఐసీయూలో మంచం కాళ్లు విరిగిపోవడంతో ఇనుప స్టూల్ సపోర్ట్‌గా పెట్టిన దృశ్యం

కొత్త పాలకులపైనే ఆశలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు అందరు వారే ఉన్నా ఆసుపత్రి అభివృద్ధి విషయంలో పట్టించుకోలేదు. అడపాదడపా స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి వచ్చినా తూతూ మంత్ర ఆదేశాలతో కాలం గడిపారన్న ఆరోపణలు మూటకట్టుకున్నారు. ఎన్నికల ముగిసాయి, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త పాలకులైనా జిల్లాకు గుండెకాయలాంటి పెద్దాసుపత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టి పేదరోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చూస్తారని అనంత జనం ఎదురు చూస్తున్నారు.

విలీనం నష్టాన్ని భర్తీ చేయాలి

● ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



మాట్లాడుతున్న పలిశెట్టి దామోదరరావు

అనంతపురం కల్చరల్, జూన్ 16: ఏపీఎస్ ఆర్టీసీని గత వైసీపీ ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఉద్యోగులకు కలిగిన నష్టాన్ని నూతన ప్రభుత్వం భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వీకే భవన్‌లో నిర్వహించిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రాంతీయ కమిటీ సమావేశంలో ఆయన మా ట్లాడారు. విలీనం వల్ల ఉద్యోగులు పాత పెన్షన్ విధానానికి దూరమవడం.. ఆర్టీసీలో దశాబ్దాలుగా ఉద్యోగుల భాగస్వామ్యంతో ఉన్న ఎస్ఆర్‌బీఎస్ తదితర పెన్షన్ పథకాన్ని రద్దు చేయడం.. రెఫరల్ ఆస్పత్రుల్లో వైద్య సౌకర్యాలు పొందే వెసులుబాటును తొలగించడం వల్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తుందన్న నమ్మకంతో ఉన్నామని, భవిష్యత్‌లో ఉద్యోగుల నమ్మకాలు వమ్ము చేయకుండా న్యాయం చేయాలని కోరారు. అనంతరం వైఎస్ఆర్ యూనియన్ నుంచి 90 మంది సభ్యులు ఎంప్లాయిస్ యూనియన్‌లోకి చేరారు. వారికి దామోదరరావు ఎర్ర కండువాలు కప్పి స్వాగతించారు. ఈయూ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జీవీ నరసయ్య, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్‌రావు, నబిరసూల్, జోనల్ అధ్యక్ష కార్యదర్శులు కుమార్, రాజశేఖర్, ఏజీటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేష్‌గౌడ్, కొండయ్య, ఓబుళరత్నం, కల్లప్ప, జీవైపీ రావు, జీవీ నరసయ్య, భాస్కర్‌రెడ్డి, గోపాల్, వెంకటేశ్వర్లు, సోమశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను చించేసిన దుండగులకు పిండప్రదానం

ధర్మవరం, జూన్ 16: పట్టణంలోని 9వ వార్డులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించేసిన దుండగులకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పిండప్రదానం చేశారు. రాష్ట్రంలో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యేగా సత్యకుమార్‌యాదవ్ గెలుపొందిన సందర్భంగా 9వ వార్డులో జనసేన నాయకుడు అడ్డగిరి శ్యాంకుమార్ ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. ఇది జీర్ణించుకోలేక కొందరు దుండగులు చించేశారు. ఇందుకు నిరసనగా ఫ్లెక్సీని చించేసిన దుండగులకు అర్చకుడిని పిలిపించి పిండప్రదానం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు ఎవరూ పాల్పడకుండా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జనసేన నాయకులు తెలిపారు. బెస్త శ్రీనివాసులు, దుర్గమ్మ, ముత్యాలప్ప, రామాంజి, సుధాకర్ రెడ్డి, భవానిశంకర్, తలారిప్రతాప్, షఫి, లక్ష్మీనారాయణ, అఖిల్, భగవాన్, రామ్‌చరణ్, ప్రవీణ్‌యాదవ్ పాల్గొన్నారు.



పిండప్రదానం చేస్తున్న జనసేన నాయకులు

నిరుపేదల్లో.. చిగురిస్తున్న ఆశలు..!

● గత టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు
● వైసీపీ పాలనలో నిర్లక్ష్యం
● కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో నిరుపేదల్లో ఆనందం



కొటిపి వద్ద ఆగిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణం

హిందూపురం, జూన్ 16: పట్టణంలో ఎన్నో ఏళ్లుగా సొంతిల్లులేక వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. అలాంటి వారికోసం గత తెలుగుదేశం హయాంలో ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి శ్రీకారం చుట్టింది. పట్టణంలోని 3 వేల మందికిగాను కొటిపి సమీపంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2018 జనవరి 10న ఇళ్ల నిర్మాణానికి అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ భూమిపూజచేసి పనులు ప్రారంభించారు. 2019 ఎన్నికలు జరిగే నాటికి 70శాతం పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం మారడంతో ఈ ఐదేళ్లు టిడ్కో ఇళ్ల గురించి పట్టించుకున్న పాపాన వైసీపీ పాలకులు పోలేదు. దీంతో ఇళ్ల నిర్మాణం కోసం అక్కడున్న కొన్ని పరికరాలు దొంగలెత్తుకెళ్లారు. ఈ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలవడం బాలకృష్ణ ఎమ్మెల్యే కావడంతో మరోసారి టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. దీనికితోడు తెలుగుదేశం అధికారంలోకి వస్తే టిడ్కో ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇదే మాటను బాలకృష్ణ కూడా చెప్పారు. దీంతో ప్రభుత్వం మారడం ఎమ్మెల్యే బాలకృష్ణ రావడంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తయి మాకు అప్పగిస్తారని వేయి కళ్లతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

గత టీడీపీ హయాంలో నిర్మాణం

తెలుగుదేశం హయాంలో పట్టణానికి సంబంధించి కొటిపి వద్ద మొదటి దశ కింద 2050ఇళ్లు, రెండోదశ 6500 ఇళ్లు నిర్మాణం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అందరికీ ఇల్లు పథకం కింద టిడ్కో సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీ ప్లస్ 3 తరహాలో అపార్ట్‌మెంట్‌లో ఇళ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో 300, 365, 430 చదరపు అడుగుల్లో లబ్ధిదారుల వాటా కింద ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో 2736 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించి పనులు మొదలు పెట్టారు. మొదట్లో లబ్ధిదారులు రాకపోయినా పాలకులు దీనిపై అవగాహన కల్పించారు. దీనివల్ల లబ్ధిదారులు డీడీలు చెల్లించారు. 300చ.అడుగులకు 1104మంది, 365చ.అ.లకు 1355, 430చ.అడుగులకు 288మంది డీడీలు చెల్లించారు. దీనికోసం 2516 మందికి ఇళ్లు కేటాయించారు. వారికి బ్యాంక్ లింకేజీ కింద 380 మందికి పలు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించారు. అంతేకాక డీడీలు ఇప్పటి వరకు కట్టించుకున్నవాటిని వెనక్కు ఇవ్వలేదు. ఇళ్లు అప్పగించలేదు. దీంతో టీడీపీ కాలంలో చేపట్టిన పనులే తప్ప ఒక్క అంగుళం పనికూడా చేయలేదు. వైసీపీ పాలనంతా టిడ్కో ఇళ్లపై నిర్లక్ష్యం వహించారు. దీంతో ఐదేళ్లుగా ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

కూటమి ప్రభుత్వంతో నిరుపేదల్లో ఆనందం

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఎమ్మెల్యే బాలకృష్ణ మూడోసారీ గెలవడంతో పట్టణానికి చెందిన లబ్ధిదారులు ఆనందం వెల్లివిరుస్తోంది. మరీ ముఖ్యంగా నిరుపేదలు బాడుగలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్న వారు టీడీపీ గెలుపుతో ఇక మాకు సొంతింటికల నెరవేరే సమయం ఆసన్నమైందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు గుర్తించి మాకు ఇళ్లు అప్పగిస్తారని ఎదురుచూస్తున్నారు. అయితే వైసీపీ పాలనలో డెడ్‌లైన్‌లు పెట్టారు తప్ప ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. దీనివల్ల నిరుపేదలు దానిపై ఆశలు వదులుకున్నారు. వైసీపీ కాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ఇక్కడున్న పరికరాలు చోరీకి గురికావడమేకాక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇక ఇళ్ల నిర్మాణాలపై బాలయ్య దృష్టిసారిస్తారని నిరుపేదలు చెప్పుకుంటున్నారు.

కైవారం తాతయ్య ఆరాధనోత్సవాలు



కైవారం తాతయ్య విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

హిందూపురం అర్బన్, జూన్ 16: పట్టణ పరిధి లోని కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శనవారం కైవారం తాతయ్య 189వ ఆరాధనోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి విగ్రహానికి వివిధ అభిషేకాలు, అర్చనలు చేశారు. అలాగే 24 గంటల పాటు అఖండ రామభజన చేసి, ఆదివారం ఉదయం పురవీధుల్లో నగర సంకీర్తన చేపట్టారు. హిందూపురం ప్రాంతం నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడులోని భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కైవారం తాతయ్య ట్రస్ట్ బోర్డు సభ్యుడు బాగేపల్లి నరసింహయ్య, కృష్ణయ్య కుప్పం వెంకటాచలపతి తదితరులు హాజరయ్యారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

పెనుకొండ రూరల్, జూన్ 16 : క్షయవ్యాధితో బాధపడుతున్న పట్టణానికి చెందిన శివయ్య(66) అనే వృద్ధుడి మృతి ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. అయితే అతడి గొంతుకోసు కుని ఉండడంపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు... పట్ట ణంలో రైల్వే స్టేషన్ వెళ్లేదారిలో ఉన్న కాలనీలో నివాసముంటున్న శివయ్య ఎలక్ట్రీషియన్ పనిచేస్తూ కుటుం బాన్ని పోషించేవాడు. ఐదేళ్లుగా క్షయ వ్యాధితో బాధపడుతుండేవాడు. అతడికి సంతానం లేదు. శివయ్య ఈనెల 14న ఉదయం 10గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. అయితే రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే బ్రిడ్జికింద కత్తితో చెయ్యి, గొంతు కోసుకుని ఉన్న మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఆదివారం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య ఉమాదేవి, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా హత్యచేసి ఉంటారా, ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన తమిళనాడు వాసి మృతి

పెనుకొండ రూరల్, జూన్ 16: మండలంలోని తిమ్మాపురం సమీపంలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జివద్ద శనివారం రాత్రి ద్విచక్రవాహనం అదుపు తప్పి బీఎస్ఎన్ఎల్ కార్యాలయ గోడను ఢీకొనడంతో తమిళనాడుకు చెందిన ధనుంజయ(34)అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడు బెంగళూరులో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. తమిళనాడుకు చెందిన ధనుంజయ అమ్మవారిపల్లిలో కియ పరిశ్రమకు అవసరమయ్యే విడిభాగాలకు సంబంధించిన పాలిక్యాట్ కంపెనీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తుండేవాడు. విధుల్లో భాగంగా శనివారం రాత్రి ధనుంజయ పెనుకొండ నుంచి ద్విచక్రవాహనంలో అమ్మవారిపల్లి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తిమ్మాపురం సమీపంలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న బీఎస్ఎన్ఎల్ కార్యాలయాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ధనుంజయకు తీవ్రగాయాలుకాగా స్థానికులు పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లా రు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. అక్కడ బాప్టిస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం



ముకుందప్ప భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న గుండుమల తదితరులు

అగళి, జూన్ 16: టీడీపీ మండల మాజీ కన్వీనర్ ముకుందప్ప మృతి బాధాకరమని, పార్టీలోని మంచి నాయకుడిని కోల్పోయామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. ముకుందప్ప శనివారం మృతిచెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న గుండుమల ఆదివారం మండలంలోని ఇరిగేపల్లిలో ముకుందప్ప ఇంటికి వెళ్లి భౌతికకాయాన్ని దర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. ముకుందప్ప పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు టీడీపీలోనే కొనసా గడం అభినందనీయమన్నారు. ఆ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర వక్కలిగ సాధికార సమితి అధ్యక్షుడు పాండురంగప్ప, టీడీపీ నా యకులు రమేష్, శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు.

టీచర్ రంగనాథప్పకు పరామర్శ

రొళ్ల, జూన్ 16: మండలంలోని పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన టీచర్ రంగనాథప్ప కుమారుడు తేజేస్వర్‌రెడ్డి కొద్ది రోజుల క్రితం కర్నూల్ పట్టణంలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తేజస్వర్‌రెడ్డి కర్నూల్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతూ పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం విదితమే. దీంతో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆదివారం రంగనాథప్ప ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, యోగానంద్, రామకృష్ణ, ఈశ్వరప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ... వ్యక్తికి గాయాలు

అగళి, జూన్ 16 : మండల పరిధిలోని రామనపల్లి సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో డొక్కలపల్లికి చెందిన లింగేగౌడ తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. డొక్కలపల్లికి చెందిన లింగేగౌడ అగళి నుంచి రొళ్ల వైపు వెళ్తున్నాడు. అయితే అగళి మం డలం ఇరిగేపల్లి గొల్లహట్టికి చెందిన రెడ్డప్ప తన కారులో రొళ్ల మండలం నుంచి అగళి వైపు వెళ్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో లింగేగౌడ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి గాయపడ్డ లింగేగౌడను రొళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

మాయమౌతున్న మన్రో తోపు

రోడ్ల విస్తరణతో తరిగిపోతున్న పచ్చని చెట్లు



మన్రో తోపు వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు

చిలమత్తూరు, జూన్ 16: నాడు పచ్చదనం, ఆహ్లాదానికి మారు పేరుగా నిలిచిన కోడూరు మన్రో తోపు నేడు మాయమైపోతోంది. రోడ్ల విస్తరణలో భాగంగా 20 ఏళ్లుగా మహా వృక్షాలు నేలకొరిగి పోయాయి. దీంతో వందల సంవత్సరాలుగా కోడూరు అంటే టక్కున గుర్తుకు వచ్చే విప్ప చెట్ల సమూహం పూర్తిగా కనుమరుగైపోయిందనే చెప్పవచ్చు. అప్పటి బ్రిటీష్ పాలనలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన థామస్ మన్రో దొర కోడూరు సమీపంలో కుషావతి నది పక్కన 44వ జాతీయ రహదారికి ఇరువైపులా ఒక వరుస క్రమంలో వందల సంఖ్యలో విప్ప, చింత మొక్కలను నాటించారు. ఆయన నాటించిన మొక్కలు ప్రస్తుతం మహా వృక్షాలయ్యాయి. సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలోని ఈ తోపు నిత్యం పచ్చదనంతో కళకళలాడేది. ఎంతో ఆహ్లాదాన్నిచ్చే ఈ తోపులో జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులు, స్థానికులు సేద తీరువారు. పచ్చని చెట్లతో కళకళలాడే మన్రో తోపు ఇప్పుడు రోడ్ల విస్తరణలో కనుమరుగైపోతోంది. గతంలో 44వ జాతీయ రహదారిని విస్తరించే క్రమంలో ఈ తోపులో ఉన్న పెద్ద పెద్ద వృక్షాలను కూకటి వేళ్లతో పెకలించేశారు. ఇప్పుడు కోడూరు తోపు నుంచి పుట్టపర్తికి వెళ్లే రహదారిని నాలుగు లేన్ల రహదారిగా మార్చడంతో ఆ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ మన్రో తోపులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. ఇలా మన్రో తోపునకు రోడ్ల విస్తరణ పనులు శాపంగా మారాయనే చెప్పవచ్చు. దీంతో వందల ఏళ్లుగా పచ్చదనానికి పేరుగాంచిన మన్రో తోపు పూర్తిగా తెరమరుగైనట్లేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పెరిగిన ఆక్రమణలు

రోడ్ల విస్తరణకు తోడు కొంత కాలంగా మన్రో తోపులో ఆక్రమణలు కూడా అధికంగా పెరిగాయి. పచ్చని చెట్ల స్థానంలో నివాసాలు ఏర్పాటుచేసుకున్నారు. దీని కారణంగా పచ్చని చెట్లు కనుమరుగవుతున్నాయి. నాడు వేల సంఖ్యలో ఉన్న చెట్లు ఆక్రమణలతో పదుల సంఖ్యకు చేరాయి. మన్రోతోపును సంరక్షించాల్సిన అధికారులు వారి కళ్లెదుటే ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోవంలేదన్న విమర్శలు వినవస్తున్నాయి. ఈ తోపు గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉంది. పంచాయతీ వారు సరిహద్దులను గుర్తించి కంచె ఏర్పాటుచేయకపోవడంతో కొందరు మన్రోతోపు శివార ప్రాంతాలను ఆక్రమించి కబ్జాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా వందల సంవత్సరాల నాటి మన్రో పేరును నిలబెట్టి కూలిన పచ్చని చెట్ల స్థానంలో కొత్త మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





మన్రో తోపులో ఎండిన విప్ప చెట్లు

విద్యే పెద్ద ఆస్తి : మాజీ మంత్రి పల్లె



సగర విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న పల్లె రఘునాథరెడ్డి

హిందూపురం అర్బన్, జూన్ 16: తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులు పంచకపోయినా పరువాలేదుకానీ విద్యను పంచాలని తెలుగుదేశం నాయకుడు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. హిందూపురంలోని సప్తగిరి కళాశాలలో ఆదివారం 2024వ సంవత్సరంలో పదోతరగతి, ఇంటర్‌లలో ప్రతిభ చాటిన సగర ఉప్పర విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. భగీరథ ఎడ్యుకేషనల్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి మాట్లాడుతూ... విద్యార్థులకు చదువే గొప్ప సంపద అన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిభా విద్యార్థుల కు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, భగీరథ ఎడ్యుకేషన్ సేవా ట్రస్ట్ హిందూపురం అధ్యక్షుడు ఆదినా రాయణ, అనంతపురం ఉప్పర సంఘం అధ్యక్షుడు నాగముని, రిటైర్డ్ ఎస్‌ఐ నాగరాజు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, కోశాధికారి రామాంజనేయులు, నాయకులు రాజశేఖర్, మహంతేశ్వర్, ఈశ్వరప్ప తదితరులు ఉన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి

హిందూపురం అర్బన్: విద్యాతోనే దేశాభివృద్ధి సాధ్యమని వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు పేర్కొన్నారు. స్థానిక వాల్మీకి భవన్‌లో ఆదివారం 2024వ సంవత్సరంలో పదోతరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందనీ, విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు మంచి చదువులు అందించాలని సూచించారు. ప్రతిభా విద్యార్థులకు పురస్కారాలు అందించారు. వాల్మీకి ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శివయ్య, గౌరవాధ్యక్షుడు పుట్టక మ్మప్ప, నాయకులు శివన్న, రామకృష్ణ, నరసింహులు, ఆదినారాయణప్ప, నారాయణస్వామి, జనార్ధన్, వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకుడు కదిరి బంగారు క్రిష్ణమూర్తి, నాయకులు బీఎన్ మూర్తి, వీసీ గంగన్న, ఓబుళపతి, సూరి ఉన్నారు.



వాల్మీకి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న దృశ్యం

'తాగునీటి బోరుకు మరమ్మతులు చేయించాలి'



మరమ్మతులకు లోనైన బోరును పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

మడకశిర టౌన్, జూన్ 16: నగర పంచాయతీ పరిధిలోని ఏడో వార్డు కమ్యూనిటీ భవనం ఆవ రణంలో ఉన్న బో రుకు మరమ్మతు లు చేయించి తాగు నీటి సమస్య పరిష్కరించాలని టీడీపీ నాయకులు కోరారు. మున్సిపల్ మాజీ చైర్మన్ సుబ్బరాయుడు తదితర నాయకులు ఆదివారం మరమ్మతులకు గురైన తాగునీటి బోరు ను పరిశీలించారు. సంవత్సరానికి పైగా బోరు మరమ్మతులకు గురైనా నగర పంచాయతీ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ సమస్య పరిష్కరించక పోవడం దురదృష్టకరం అన్నారు. ఏడో వార్డులో తాగునీటి సమస్య ఉందని అనేకసార్లు విన్నవించినా పరిష్కరించకపోవడం బాధాకరం అన్నారు. కాలనీలో దోమల బెడద అధికంగా ఉందన్నారు. కాలువలు శుభ్రం చేయకపోవ డంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఫాగింగ్ చేయిం చి దోమల బెడదను నివారించాలని, తద్వారా కాలనీ వాసులు అనారోగ్యానికి గురికాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు బాబన్న, గంగాధర్, తనోజ్, మురళి, సంతోష్ తదితరులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



పవన్‌కుమార్ (ఫైల్)

కొత్తచెరువు, జూన్ 16: మండల కేంద్రానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన చంద్రప్పగారి రవి కుమారుడు పవన్‌కుమార్ (29) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా అతడికి షుగర్ వ్యాధి ఉంది. దీంతో చిన్నతనంలోనే షుగర్ రావడంతో మానసికంగా కృంగిపోతుండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి తీవ్ర మనోవేదనకు లోనై హైదరాబాద్‌లోని అద్దె గదిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ యువకుడు గతంలో కొత్తచెరువు మండల జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సేవాకార్యక్రమాలు చేసేవాడు. ఆదివారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడంతో ఎన్టీఆర్ అభిమానులు వచ్చి నివాళులర్పించారు.

16,075.49 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ

మడకశిర,జూన్, 16 : ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తన వేరుశనగ ను ఇప్పటి వరకు నియోజకవర్గంలోని 18,738 మంది రైతులకు 16075.49 క్వింటాళ్ల పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ ఏడీ క్రిష్ణమీనన్ ఆదివారం తెలిపారు. మొదటి విడతగా నియోజకవర్గంలోని ఐదు మండలాలకు 16124 క్వింటాళ్ల విత్తనకాయలను కేటాయించారన్నారు. రెండోమారు అదనంగా 2500 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు. మడకశిర మండలంలో 5692 మంది రైతులకు 4772.5 క్వింటాళ్లు, అమరాపురంలో 4052 మంది రైతులకు 3656.3 క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. గుడిబండ మండలంలో 3645 మంది రై తులకు 3091 క్వింటాళ్లు, అగళిలో 2064 మంది రైతులకు 1770.6 క్వింటాళ్లు, రొళ్ల మండలంలో 3285 మంది రైతులకు 2785.09 కింటాళ్ల వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 71 రైతు భరోసా కేంద్రాల ద్వారా వేరుశనగను పంపిణీ చేపట్టినట్లు తెలిపారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో సెంచరీల మోత

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 16: సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో బ్యాటర్లు సెంచరీలతో రెచ్చిపోయారు. ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్టీటీ స్టేడియంలో అంతర్-23 ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు కొనసాగాయి. అనంతపురం, చిత్తూరు జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన చిత్తూరు నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 285 పరుగులు చేసింది. రుషీల్ రెడ్డి 65, తేజా రెడ్డి 51 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం 46.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 286 పరుగులు చేసి ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. జిల్లా బ్యాటర్లు అర్జున్ టెండూల్కర్ 111 పరుగులు, యోగానంద 71 పరుగులు సాధించారు. మరో మ్యాచ్‌లో కడప, నెల్లూరురు జట్లు పోటీ పడగా.... మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 345 పరుగులు చేసింది. నిఖిలేశ్వర్ 134 పరుగులు, పర్వాద్‌ఖాద్రి 79 పరుగులు, సుబ్రమణ్యం 72 పరుగులు సాధించారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కడప 22.2 ఓవర్లలో కేవలం 90 పరుగులు చేసి ఆలౌట్ అయింది. నెల్లూరు బౌలర్ సాకేత్ రామ్ ఐదు వికెట్లు తీసి 243 పరుగులు భారీ విజయానికి బాటలు వేశాడు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సౌత్‌జోన్ మేనేజర్ ఖాజామొహిద్దీన్, సెలెక్టర్లు నాగినికుమార్, మాజీ రంజీప్లేయర్ షాబుద్దీన్ పాల్గొన్నారు.

విజేతలు ఏపీ, తమిళనాడు : సౌత్‌జోన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల విజేతలుగా ఏపీ, తమిళనాడు జట్లు నిలిచాయి. రెండు రోజులుగా నిర్వహిస్తున్న 4వ సౌత్‌జోన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ చాంపియన్‌షిప్-2024 అండర్-14 బాల, బాలికల పోటీలు ఆదివారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో ముగిసాయి. బాలుర విభాగంలో తమిళనాడు మొదటి స్థానంలో, కర్ణాటక ద్వితీయ స్థానం, తృతీయ స్థానంలో పాండిచ్చేరి- కేరళ నిలిచాయి. బాలికల విభాగంలో విజేతగా ఏపీ జట్టు, ద్వితీయ స్థానంలో తమిళనాడు, తృతీయ స్థానంలో కర్ణాటక నిలిచినట్లు రాష్ట్ర టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు.

నిరుపయోగంగా నీటి ప్లాంట్లు

- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు
- పునఃప్రారంభించాలని విన్నపం



చందకచర్లలో మూతపడిన తాగునీటి ప్లాంటు



వైబీ హళ్లిలో నిరుపయోగంగా ఉన్న ప్లాంటు

మడకశిర రూరల్, జూన్ 16: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు శుద్ధ జలాలు అందిస్తూ మూతపడిన ఎన్టీఆర్ సుజలస్రవంతి నీటిశుద్ధి ప్లాంట్లను పునః ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రజల కు శుద్ధ తాగునీరు అందించేందుకు ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా గ్రామాల్లో తాగునీటి ప్లాంట్లను ప్రారంభించింది. బిందె నీటిని రూ.2కే అందించేవారు. దీంతో గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడే వారు కాదు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది, చాల చోట్ల ప్లాంట్లు మూడపడ్డాయి. ఇప్పుడు మళ్లీ టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో మూతపడిన ప్లాంట్లను పునఃప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని వైబీ హళ్లి, చందకచర్ల, కల్లుమర్రి, ఆర్ అనంతపురం, ఆమిదాలగొంది, నీలకంఠాపురం, బుళ్లసముద్రం, మెళవాయి, హరేసముద్రం పంచాయతీ కేంద్రాల్లో ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్లను గతంలో ఏర్పాటుచేశారు. వైసీపీ పాలనలో వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పంచాయతీలలో నిధులు లేకపోవడంతో చాలా చోట్ల ప్లాంట్ల పరికరాలను మరమ్మతులు చేయించలేక పోవడంతో ఆ ప్లాంట్లు మూతపడ్డాయి. కొన్ని చోట్ల నామమాత్రంగా నడుస్తున్నాయి. దీంతో పలు గ్రామాల ప్రజలు శుద్ధ తాగునీటిని పట్టణాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. అక్కడ బిందె నీటిని రూ.10తో కొనుగోలు చేసి ద్విచక్రవా హనాలు, ఆటోల్లో తెచ్చుకోవాల్సి వస్తోంది. దీంతో డబ్బుతో పాటు సమయం వృథా అవుతోందని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం రా వడంతో గ్రామీణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మూతపడిన ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్లను మళ్లీ ప్రారంభించాలని కోరుతున్నారు.

నయనానందకరం శ్రీవారి కల్యాణం





అలంకరణలో వెంకటేశ్వరస్వా మి మూలవిరాట్టు, ఉత్సవవిగ్రహాలు

హిందూపురం అర్బన్, జూన్ 16: పట్టణ పరిధిలోని లక్ష్మీపురంలో వెలసిన బాలాజీ ఆలయంలో గోదాదేవి, లక్ష్మీదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం నయనానందకరంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారి మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు చేసి బెంగళూరు నుంచి తెప్పించిన పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11.15 నిమిషాలకు కర్కాటక లగ్న మందు వేదపండితుల మంత్రోచ్ఛారణ, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీవారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం విద్యాధరి కళానిలయం వారిచే నిర్వహించిన నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.



అన్నదానం చేస్తున్న దృశ్యం

రేపటి నుంచి డిగ్రీ తరగతులు

హిందూపురం అర్బన్, జూన్ 16: వేసవి సెలవుల అనంతరం మంగళవారం నుంచి డిగ్రీ మూడో సెమిస్టర్, ఐదో సెమిస్టర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభం అవుతాయని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ ప్రగతి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే డిగ్రీ మొ దటి సంవత్సరం బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల ప్రవేశానికి వచ్చే విద్యార్థులకు కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటామన్నారు. డిగ్రీ కళాశాలలో చేరాలనుకునే విద్యార్థులు ఇంటర్ మార్కుల జాబితా, టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, మూడు పాస్ ఫొటోలు తీసుకురావాలన్నారు. దూర ప్రాంతాలవారికి హాస్టల్ సౌకర్యం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.

రైల్వే లైన్ పనులు పూర్తి చేయాలి

కేంద్ర మంత్రికి బీజేపీ నాయకుల వినతి



కేంద్రమంత్రి సోమణ్ణకు వినతి ఇస్తున్న బీజేపీ నాయకులు

రొళ్ల, జూన్ 16: రాయదుర్గం, మడకశిర మీదుగా బళ్లారి- తుమకూరు రై ల్వే లైన్ పను లను త్వరితగ తిన పూర్తి చేసి మడకశిర ప్రాంత వాసులకు రైలు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కేంద్ర రైల్వే, జలశక్తి వనరుల సహాయ మంత్రి సోమణ్ణను కోరినట్లు బీజేపీ మం డల నాయకులు ముద్దరాజు తదితరులు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో తుమకూరు లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికైన సోమణ్ణ ప్రధాని నరేంద్ర మోదీ మంత్రి వర్గంలో సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ఆదివారం తుమకూరుకు వచ్చిన సందర్భంగా నగరంలోని బావి కట్టే కల్యాణ మండపంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు , ఓటర్లకు అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంత్రి సోమణ్ణను బీజేపీ రొళ్ల నాయకులు కలిసి రైల్వే లైన్ పనులు బళ్లారి నుంచి రాయదుర్గం మీదుగా పావగడ వరకు పూర్తయ్యాయని తెలిపారు. అయితే తుమ కూరు వరకు పూర్తి కావలసిన పనులలో... మధుగిరి తాలూకాలో 10 కిలో మీటర్ల భూ స్వాధీన సమస్యను పరిష్కరించి రైల్వే లైన్ పనులు పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

'మూర్ఛవ్యాధిగ్రస్థులు అపోహలు వీడాలి'

హిందూపురం అర్బన్, జూన్ 16: మూర్ఛవ్యాధిగ్రస్తులు అపోహలను విడనాడాలని జనవిజ్ఞానవేదిక హిందూపురం జోన్ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈటీ రామ్మూర్తి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని అల్‌హిలాల్ పాఠశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 123వ మూర్ఛవ్యాధి శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూర్ఛవ్యాధి ఉన్నవారు సంసార జీవితానికి పనికిరారనే అపోహలను విడనాడాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుందన్నారు. వ్యాధిగ్రస్థులు నిప్పు, నీరు దగ్గరకు వెళ్లరాదన్నారు. ఎత్తైన ప్రదేశాల్లో సంచరించరాదన్నారు. ఈ సందర్భంగా 129 మంది వ్యాధి గ్రస్థులను పరిశీలించి, ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో గంగిరెడ్డి, అతావుల్లా, ఉగ్రప్ప, నాగేంద్రాచారి, ప్రభాకర్, బాలగంగాధర్‌నాయక్, ఎం. రామకృష్ణ, సుబ్రహ్మణ్యనాయక్ తదితరులు ఉన్నారు.

మహిళ మృతదేహం స్వాధీనం

రాప్తాడు, జూన్ 16: మండలంలోని ప్రసన్నాయపల్లి రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం రైల్వే జీఆర్పీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. రైల్వే గేటు సమీపంలో ఆ మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు తమకు సమచారం ఇచ్చారన్నారు. తాము స్థలానికి వెళ్లి పరిశీలించామని, మహిళ వివరాలు తెలియలేదని అన్నారు. మహిళ వయసు 40 నుంచి 50 సంవత్సరాలు ఉంటుం దన్నారు. సమాచారం తెలిసిన వారు ధర్మవరం రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

రైతులకు విద్యుత్ మోటార్ల పంపిణీ



రైతులకు పరికరాలు అందజేస్తున్న పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, జూన్ 16 : గంగకల్యాణి పథకం కింద 2021-22 సంవత్సరానికిగాను మంజూరైన పంపుసెట్లు, పైపులను 24మంది రైతులకు ఆదివారం ఎమ్మెల్యే వెంకటేశులు చేతలమీదుగా పంపిణీ చేశారు. దాదాపు రూ. 5లక్షల నుంచి రూ.6లక్షల వరకు సరిపడా వ్యవసాయ పరికరాలను అందజేశారు. ప్రతి రైతు ఈ పరికరాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామాంజినప్ప, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ 48వ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, కార్యకర్తల మధ్య ఎఎస్ఎస్‌కె రంగ మందిరంలో ఘనంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం 1గంటకు 48కేజీల కేక్‌ను కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టి 2023లో మీరందరూ ఓట్లేసి గెలిపించిన ఆశీస్సులు, దీవెనలు నాకు జీవితాంతం ఉండాలని అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఖరీదైన కారులో తిరిగినా తన మనసెప్పుడు పేదవాడిగానే ఉంటుందని, పేదల పట్ల విద్యార్థుల విద్యపట్ల ఎప్పుడూ ముందంజలో ఉంటానన్నారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచితంగా విద్యా సామాగ్రి పంపిణీ చేశారు.